# అదృశ్య శక్తి

కె.బి.యస్. కుమార్

ఛెళ్ళుమన్నది నా చెంప.

నా కళ్ళముందు చుక్కలు నాట్యం చేశాయి. కళ్ళలో నీళ్ళు తిరిగాయి. బుగ్గలమీదుగా జారాయి. తడిచేత్తో చెంపని అదిమిపట్టుకుని అర్జున్‌ని చూశాను. ఆ చూపుల్లో నిరసన వుంది.

అర్జున్ కళ్ళు నిప్పులు చెరుగుతున్నాయి.

నా కళ్ళలో రుధిరం పేరుకుపోతోంది. అంచులు దాటిన నీటిమట్టంలా ఒక్కొక్క చుక్కే క్రిందికి రాలుతోంది.

నా చూపుల్లో వర్ణించలేని తిరస్కార భావం వుంది. లోకాన్నే శపించగల క్రోధం యిమిడి వుంది. వాటికే శక్తి వుంటే ఈపాటికి అర్జున్ మాడి మసైపోయి వుండేవాడు.

"అయితే నీ నిర్ణయం మారదన్నమాట!!" గద్దించినట్టుగా అన్నాడు అర్జున్.

చటుక్కున ఇవతలికి తిరిగాను. వాడి మొహం చూడ్డం కూడా యిష్టంలేదు నాకు. రోగ్! బ్లడీ బాస్టర్డ్! డర్టీ రాస్కెల్! వాడి అంతం చూడాలి నేను.

"ఒరే పవన్.... నా మాటలు విన్నా! నీకు పుణ్యముంటుంది! యిది మంచి ఆఫర్! నీకు పదివేలు యిస్తాను. పంతాలకు పోయి పైకాన్ని నష్టపోకు. ఆఖరిసారిగా చెబుతున్నాను. నా పరువు తియ్యకు."

"ఛూ....! పరువు! పరువు నీకెక్కడుందిరా!? ఇప్పుడు సంఘంలో నువ్వనుభవిస్తోన్న, ఈ పరువు ప్రతిష్టలూ అనుభవిస్తోన్న ఈ రాజభోగాలు ఎవరి దయా భిక్షో ఒక్కసారి నీ అంతరాత్మ నడుగు. పవన్ పవన్ పవన్ అని గొంతు చించుకుని అరుస్తుంది. అసలు నీకు అంతరాత్మ అనేదుందా!? నువ్వు మనిషివి కాదురా! రాక్షసుడివి! నువ్వు కళాకారుడివి కావురా! కళాద్రోహివి!"

"స్టాపిట్!" గట్టిగా గర్జించాడు అర్జున్. ఆ అరుపులు ఈ గదికి సంబంధించిన నాలుగ్గోడలకూ లోపలివైపున విసురుగా తగిలి—బైటికి పోవటానికి మార్గంలేక—భళ్ళున బ్రద్దలై పోయాయి.

"నీకెలా బుద్ధి చెప్పాలో నాకు తెల్సు...." వెచ్చటి ఆవిరితో కలిసి విడివిడిగా అస్పష్టంగా వచ్చాయా మాటలు వాడి నోటి వెంట. నేలపై గట్టిగా తాటించి విసవిసా వెళ్ళిపోయినట్టు గ్రహించాను. కొద్దిక్షణాలకి కిర్రుమన్న చప్పుడు లీలగా వినిపించింది.

వెనుదిరిగాను. గదినంతా ఒక్కసారి పరిశీలించాను.

దాదాపు నలభై చదరపు మీటర్ల వైశాల్యమున్న గది ఇది. బలమైన సిమెంటు గోడలు. తూర్పు గోడకి గడియారం వ్రేలాడుతోంది. ఏ కంపెనీదో ఏ దేశందో

గాని క్రొత్తగా వుండది. దక్షిణం వైపున ఓ మూలకి ఎటాచ్డ్ బాత్రూమ్ వుంది. నిరంతరం నీరు సమృద్ధిగా వుంటుంది. ఉత్తరం వైపున ఫ్రిజ్ వుంది. పడమర వేపున ఖరీదైన టేబుల్, రివాల్వింగ్ ఛైర్. టేబుల్ పై టేబుల్ ల్యాంప్ తో బాటు నాక్కావలసిన పరికరాలన్నీ వున్నాయి.

గోడలకి అందమైన డిస్టెంపర్లు. నేలమీద ఖరీదైన కార్పెట్.

ఉత్తరం వైపున్న కిటికీలోంచి నాకు ఆహారం సప్లయ్ చెయ్యబడుతుంది. ఫ్రిజ్ లో ఎగ్స్, బాయిల్డు ఎగ్స్, ఆమ్లెట్స్, మిల్క్, జ్యూస్, ఫ్రూట్స్ వంటి పదార్థాలు సమృద్ధిగా వుంటాయి. గదిలో గాలి ధారాళంగా వీస్తూంటుంది. ఫిలిప్స్ ట్యూబ్ లైట్సు రెండు యిరవై నాలుగ్గంటలూ వెలుగుల్ని పంచుతూ వుంటాయి. అవసరం లేదనుకుంటే జీరో లైటు సౌకర్యం కూడా వుంది. సిగరెట్లు తెస్తాడు నౌఖరు.

చూసేవాళ్ళకిది ఇంద్రభవనంలా కనిపిస్తుంది. టేబుల్ కి కాస్త ఇవతలి వైపున మంచం, దానిమీద ఫోమ్ బెడ్, డన్ లప్ పిల్లో, బెడ్ షీటు కంటబడితే యిరవై నాలుగ్గంటలూ నిద్రపోదామనిపిస్తుంది.

కాని నాకు మాత్రం అది నరకం. గదిలోని వస్తువులన్నిట్నీ చిందరవందరగా పారెయ్యాలనీ బద్దలు కొట్టాలనీ పిచ్చి ఆవేశం కలుగుతుంది నాకు.

క్రొత్త క్రొత్త రుచుల్ని సంతరించుకుని నాకు అందించబడుతోన్న ఆహారపదార్థాలు నా ప్రాణం పోకుండా నిలబెడుతున్నాయే గాని వాటి ప్రత్యేకతల్ని నా మస్తిష్కం గుర్తించలేకపోతోంది.

కారణం....

నేను బందీని!

ఒక స్వార్థపరుడి ఉక్కు కౌగిట్లో చిక్కుకుని స్వేచ్ఛ కోసం అలమటిస్తోన్న ఖైదీని నేను!

ఎనిమిది గంటలు చూపుతోంది గడియారం. అది పగలో రాత్రో తెలీదు. పదిహేడు అంకె చూపుతుంది గడియారంలోని ఓ భాగం అది తేదీయేగాని - ఏ నెలో తెలీదు.

నన్నీ స్థితికి తెచ్చిందెవరు? వాడే! అర్జున్ గాడు!

కేవలం వాడేనా!?

కాదు. నా తప్పుకూడా కొంత వుంది అందులో.

## 2

వాడి అక్కలు, అన్నలు ఎవరూ లేరుగాని నలుగురు చెల్లెళ్ళున్నారు.

పెద్ద చెల్లెలు పెళ్ళప్పుడు కట్నం అయిదొందలు తక్కువైతే యిచ్చేంతవరకూ తాళికట్టమని పెళ్ళికొడుకు తరఫు వాళ్ళు మొండిపట్టు పట్టేసరికి పెళ్ళి సవ్యంగా జరుగుతుందో జరగదో అన్న భయం నాన్న గుండెని ఆపేసింది. పెళ్ళి వాయిదా పడింది.

కన్యాదాన ఫలం సంక్రమిస్తుందని. ఆడపిల్ల తండ్రి చనిపోయినా ఆ పిల్ల పెళ్ళి మూడు మాసాల్లోగా చెయ్యొచ్చునని పురాణాలు శాస్త్రాలు ఘోషిస్తున్నా తొంభైరోజులు ఓపికపట్టే సహనం మగపెళ్ళి వారికి లేకపోవడంతో మరో సంబంధం చూసుకున్నారు. కట్నం డబ్బు గోవిందా అయిపోయింది.

రెండో చెల్లెలికి చిన్నతనంలో పోలియో సంక్రమించింది. దానికి జన్మలో మూడు ముళ్ళు పడతాయన్న

నమ్మకం పోయింది.

మూడో చెల్లెలు ఇంటర్వ్యూకి వెళ్ళి వస్తోండగా ట్రెయిన్ ఆలస్యం కావటంతో చీకటిపడింది. రిక్షా మాట్లాడుకొని వస్తోండగా దారిలో రిక్షావాడు, మరి యిద్దరు కల్సి దాన్ని పొదల్లోకి లాక్కుపోయి మాన భంగం చేశారు. అది మోడులా ఇంట్లో మిగిలిపోయింది.

పోతే చిన్న చెల్లెలు. దాని పేరు దీప. మా యింటికి నిజంగా దీపమే అది. బియ్యే పాసైంది. ఓ కాన్వెంట్ స్కూల్లో మూడొందలకి టీచర్‌గా పంజేస్తోంది. పెద్దక్కకి కుట్టు నేర్పించి కుట్టుమిషన్ కొనిచ్చింది. ఇదంతా చూసి రెండోది యింటికద్దకి పదిమంది పిల్లల్ని పిలిపించుకుని ట్యూషన్లు చెబుతోంది. మూడో చెల్లెలు ఎప్పుడూ శూన్యంలోకి చూస్తూ గడుపుతూంటుంది.

చూడ్డానికి అమ్మడు శూన్యంకూడా మిగల్లేదు. ఆమె ప్రాణమున్న బొమ్మ. ఆమె కళ్ళు గాజుగోళాలు. మనసు రాతిబండ. అంతే.

ఆవేదన అనే కవ్వంతో మనసు మధించబడినప్పుడు కవిత్వం అనే పదార్థం పుడుతుంది కాబోలు. అది అమృతమో గరళమో నాకు తెలీదు. మనసు బాగా లేనప్పుడు డాబామీద ఒంటరిగా కూచుని బీడీలు తగలేస్తూ యేవేవో గీకేవాణ్ని. అవి ఒకోసారి కవితలయేవి. ఒకోసారి కథలయేవి. పత్రికలకి పంపిస్తే నా వూహాల్ని తలక్రిందులు చేస్తూ అవి అచ్చయ్యాయి.

రచయితగా నాకు ముద్రపడిపోయింది, మా ఇంట్లో.

రచనల నెపంతో మనస్తాపాన్ని మరో లోకానికి డైవర్టు చేస్తూ తాత్కాలికంగా ఉపశమనం పొందేవాణ్ణి.

ఉద్యోగం ఎటూ రాదు. సిటీలో అయితే నలుగురూ

పరిచయమవుతారు. మామూలుగా రచనలు చేస్తేనే నలభై శాతం అచ్చవుతున్నాయి. సిటీలో నాలుగు పత్రికాఫీసుల్ని దర్శించి నలుగురు ఎడిటర్లని పరిచయం చేసుకుంటే? నన్ను నేను పోషించుకోవచ్చు, ఇంటికి అంతో యింతో యివ్వొచ్చు.

ఈ ఆలోచన రాగానే ఆలస్యం చెయ్యలేదు నేను. ఏదో రచన తాలూకు పారితోషికం యాభై రూపాయలు తీసుకొని హైదరాబాదు రైలెక్కేశాను.

ఏన్నో పత్రికాఫీసులు తిరిగాను. మరెందర్నో పరిచయం చేసుకున్నాను. అందరూ యెంతో ఆప్యాయంగా మాట్లాడారు.

కొండంత ఉత్సాహంతో వారం రోజులు ఇంట్లోనే కూర్చుని నిర్విరామంగా శ్రమించి పది రచనలు చేశాను. కవర్లకీ స్టాంపులకీ దీపవద్ద పైకం యిప్పించుకుని పోస్టు చేశాను.

అన్ని రచనలూ అచ్చయ్యాయి. అయితే ఒక్కదానికీ పారితోషికం రాలేదు.

నాకో విషయం బోధపడింది, ఈ అనుభవంతో.

తినుకై తాము అర్థింపుగా వెడితే సాహిత్యరంగంలో కూడ చులకన కాక తప్పదు.

ఇంకో విషయంకూడా బాగా గ్రహింపుకి వచ్చింది నాకు.

నేను రచయితగా డబ్బూ కీర్తి గడించాలంటే రచయితగా నాకు బాగా పేరుండాలి. రచయితగా పేరుండాలంటే బోలెడన్ని రచనలు వెలుగులోకి రావాలి.

బోలెడన్ని రచనలు చెయ్యడానికి సిద్ధమే. కాని

కనీసం పాతికో పరకో పారితోషికంగా ముడితేనే అది సాధ్యమవుతుంది. లేదా నాలోని రచయిత అంతరించి పోయే ప్రమాదం వుంది.

శిశువుకి జన్మనివ్వటానికి స్త్రీ నవమాసాలు మోసి, యెన్నో జాగ్రత్తలు వహించి నొప్పులు తిని—యిన్ని బాధలు పడ్డట్టే రచయితకూడా ఒక రచన వెలువరించాలంటే యెంతో శ్రమ తీసుకోవాలి. ప్లాట్ ఆలోచించుకోవాలి. కథ, కథనం, శైలి, శిల్పం విషయాల్లో యెన్నో మెళకువలు చూపి పాఠకులు లీనమై చదివి ఆ రచయిత రచనలు మరిన్ని రావాలనీ చదవాలనీ కోరుకొనే విధంగా రాయగలగాలి.

ఎంత సమయం వృధా అవుతుంది?

ఎంత ఎనర్జీ వేస్టవుతుంది?

ఎంత పేపరు వినియోగించబడుతుంది?

ఎంత కాఫీ (అలవాటుంటే) ఖర్చవుతుంది?

ఎన్ని సిగరెట్లు (డిటో) తగలబడుతాయి?

ఎన్ని స్టాంపులు కావాలి???

ఎంతో కొంత ప్రతిఫలంగా ముడితే ఆ జీవి యెంత సంతోషిస్తుంది? అది ప్రోత్సాహమై—ఆ ప్రోత్సాహం మరింత ఉత్సాహాన్నివ్వగా ప్రతి రచయితా సాహితీ క్షేత్రాన్ని కలమనే హలంతో చక్కగా దున్ని బంగారు పంటలు పండించగలడు.

ఈ పంథాలో ఎందుకాలోచించరు సంపాదకులు?—

• • •

ఎవరిదో చెయ్యి—భుజమ్మీద పడేసరికి ఉలిక్కిపడి తలెత్తాను.

ఎదురుగా అర్జున్!

"ఏమిటి? కెనాల్ గట్టున ఒంటరిగా కూచుని దీర్ఘాలోచనలో పడ్డావు. కొంపదీసి విఫల ప్రేమ కాదు గదా!?"

నవ్వాను. "ఎప్పుడొచ్చావ్?" అడిగాను. కాలువ అవలి గట్టున వరసగా వున్న పూరిళ్ళని చూస్తూ.

"సిటీనుండి నిన్ననే వచ్చాను. ఇవాళే వెడుతున్నాను. పలకరించి పోదామని మీ యింటికెళ్తే యిక్కడికెళ్ళింటావని చెల్లెమ్మ చెప్పింది" అన్నాడు అర్జున్.

కాసేపు అవీ యివీ మాట్లాడాక నా గురించి టాపిక్ వచ్చింది. బాధలన్నీ ఏకరువు పెట్టాను.

"నువ్వు కథలు రాస్తున్నావా? నాకు తెలీదే!" అంటూ ఆశ్చర్యపోయాడు.

తడిసి నల్లగామారి కాలువలో కట్టగా కొట్టుకు వస్తోన్న గడ్డిపోచల్ని చూస్తూన్న నేను బదులివ్వలేదు.

"కథలు రాసేవాళ్ళు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నారు ఈనాడు. పత్రికలుకూడా చాలమటుకు పాఠకుల్ని ఆకట్టుకుని వాళ్ళని రచయితలుగా మార్చటానికి ప్రయత్నించి సర్క్యులేషను పెంచుకోవాలని చూస్తున్నాయి. పూర్వం పత్రికలూ రచయితలూ తక్కువ, పాఠకులెక్కువ, యిప్పుడలా కాదు. నువ్వు కథా రచయితగా రాణించలేవు బ్రదర్ ...."

"మరి!?"

"నవలా రచయితవైపో. సీరియల్ నవల వ్రాయి. ఇది సీరియల్ రచనాయుగం. సీరియల్స్ రైటర్సు ఈనాడు పాఠకుల ఆరాధ్య తారలు!"

పేలవంగా నవ్వాను. "కథలకే పారితోషికాలు రావట్లేదు. ఇక సీరియల్స్! ఎంత కష్టపడాలి?"

"నువ్వు పేరుకోసం రాస్తావా డబ్బుకోసం రాస్తావా?"

"ప్రస్తుతం డబ్బుకోసమే. నా ఆర్థిక స్థితిగతులు నీకు తెల్సు. అది మెరుగుపడాలంటే డబ్బు కావాలి."

"ఇదే మాటపై నిలబడగలవా?"

"ఎందుకూ అలా అడుగుతున్నావ్?"

"నేనడిగిందానికి సమాధానం చెప్పు."

"నిలబడగలను."

"అయితే నువ్వు రేపు నా వెంట సిటీకొస్తున్నావు."

"అదేం?"

"పెట్టే బేడా సర్దుకో..." అన్నాడు అర్జున్ లేస్తూ.

నాకేమీ అర్థం కాలేదు.

* * *

అర్జున్ నాకొన్ని సూచనల్నిచ్చాడు.

వాటి ప్రకారం నున్నగా షేవ్ చేసుకున్నాను. చల్లని నీటితో స్నానం చేశాను. వాడి డ్రస్సుల్లో ఓ జత తీసి వేసుకున్నాను. చక్కగా సరిపోయాయి నాకు.

వయసూ ఒడ్డూపొడుగూ దాదాపు యిద్దరం సమానమే. కాకపోతే వాడు రెండు వేల జీతగాడు కావడంతో కాస్త నున్నగా వున్నాడు.

ఆ సాయంత్రం వాడు నన్ను 'తెలుగుసీమ' వార పత్రిక ఆఫీసుకి తీసుకుపోయాడు. ఎడిటర్ని పరిచయం చేశాడు.

ఎడిటర్తో వాడికున్న చనువు చూసి ఆశ్చర్యపోయాను. వాడు రచయిత కాదు. కాని వాడికో పత్రికా సంపాదకుడు ముఖ్యమైన స్నేహితుడు. నేను రచయితని. అయినా నాకలాంటి స్నేహితుల్లేరు.

ఆ తర్వాత మేం ముగ్గురం ఓ బార్‌కి దారితీశాం. వద్దంటున్నా బలవంతంగా నా చేత 'ఛీర్స్' కొట్టించాడు అర్జున్.

మూడు పెగ్గులకే నేను మైండ్ లెస్ అయిపోయాను. ఆ తర్వాత వాళ్ళేం మాట్లాడుకున్నారో నాకు తెలీదు.

ఇల్లు చేరిన విషయంకూడా గుర్తులేదు నాకు.

మర్నాడుదయమే దాదాపు అరరీము తెల్ల పేపర్లు, కనీసం వందరూపాయలు ఖరీదు చేసే పెన్ను బీరు సీసా సైజులో ఇంక్ తెచ్చి నా ముందర పెట్టాడు అర్జున్.

అయోమయంగా చూశాను.

"క్రయిమ్, రొమాన్స్, సెక్స్, శాడిజమ్, సెంటిమెంట్! ఈ అయిదింటినీ ప్రధానాంశాలుగా తీసుకొని యితివృత్తం రూపొందించుకో. పాఠకుల్ని ఊపిరిబిగబట్టి చదివించేదిగా వుండాలి. నీ రచన చదువుతూ నువ్వే ఉత్కంఠతో బిగుసుకుపోవాలి. నవల కనీసం మూడొందల పేజీలుండాలి. మిగత నిబంధనలు నీకు తెలుసుగా!"

అంతులేని ఆశ్చర్యం నన్నుక్కిరిబిక్కిరి చేసింది.

"అంటే ... అంటే ....?"

"నువ్వు 'తెలుగుసీమ' వారపత్రిక్కి త్వరలో సీరియల్ నవల రాయబోతున్నావు ...."

ఎగిరి గంతేసినంత పని చేశాను.

"మరి అంతగా ఎగరకు. ఆనక కిందపడి ఏ చెయ్యో 'హరీ'మంటే యిబ్బంది పడాల్సొస్తుంది" అన్నాడు నవ్వుతూ.

"సరే. మెల్లిగా ఎగుర్తాను" అన్నాను నేనూ నవ్వుతూ.

"టైటిల్ చెప్పు. పబ్లిసిటీ ఈ వారంనుండే!"

"మృత్యుహేల" అన్నాను యేమాత్రం తడబడకుండా.

•  •  •

ఉలిక్కిపడ్డాను పత్రిక చూసి.

"ఇదేమిటి?" అన్నాను అర్జున్ని చూసి.

"ప్రకటన" అన్నాడు అర్జున్, నన్నూ పత్రికనూ చూస్తూ.

తెలుగుసీమ వారపత్రికలో అయిదో పేజీలో ఫుల్ పేజీ అడ్వర్టయిజ్మెంట్ అది. అందంగా నవ్వుతోన్న అర్జున్ పాస్‌పోర్ట్ సైజు ఫోటో అందంగా ముద్రించబడి వుంది.

"సాహితీ వినీలాకాశంలో మరో క్రొత్త తార! మీ హృదయాల్లో నవసాహితీ ధార!! అందిస్తున్నారు మృత్యుహేల! వివరాలకు తొందరేల??"

ఇదీ ఆ ప్రకటన! దాని చుట్టూ అర్జున్ — అర్జున్ — అర్జున్ — అనే పదాలతో పేజీనిండా ఫ్రేమ్ కట్టబడి వుంది!!

"పవన్!" నా భుజం తడుతూ అన్నాడర్జున్. "నీ అవసరాలకి నా స్వార్థాన్ని కలిపి నీకు రెండింతలు లాభం చేకూర్చబోతున్నాను. అర్థంకాలేదూ! వెల్ — అర్థమయ్యేట్టు చెబుతాను...." చిన్నగా దగ్గి మళ్ళీ మొదలెట్టాడు.

"ఏది లేదో దాన్ని కోరతాడు మనిషి. నీకు ధనకాంక్ష వుంది. నాకు కీర్తి కాంక్ష వుంది. నీకు డబ్బుతో అవసరం వుంది. నాకది బోలెడుంది. నాకు కీర్తి కావాలి. రచయితగా నన్నందరూ గుర్తించాలి. అభిమానించాలి. ఆరాధించాలి. సాటి ఉద్యోగులూ పై అధికారులూ

నన్ను గౌరవించాలి. పాఠకులూ పత్రికలూ నన్ను కీర్తించాలి. ఎక్కడైనా తారసపడినప్పుడు ఆటోగ్రాఫ్‌కోసం నా మీదికి ఎగబడాలి. ఆడపిల్లలు నన్ను ఆరాధిస్తూ ఉత్తరాలు రాయాలి. యువతులు నన్ను క్రీగంట గమనిస్తూ నవ్వులు రవ్వల బహూకరించాలి.

"ఇవన్నీ నీకు జరిగినా ఆస్వాదించే పరిస్థితుల్లేవు నీకు. దిగులే ఆస్తిగా పెంచుకుంటోన్న నీ తల్లి, కట్నం కారణంగా పెళ్ళాగిపోయిన పెద్ద చెల్లెలు, అవిటితనంతో పెళ్ళి అర్హత నిర్ణయాలోపోయిన రెండో చెల్లెలు, శూన్యంలో నిధిని చూసుకుంటూ భవిష్యత్తు చూసుకోలేకపోయిన మూడో చెల్లెలు. గుండెలు నొప్పెట్టేలా పిల్లల్తో అరచి అంతంత మాత్రం సంపాదిస్తోన్న చిట్టి చెల్లెలు!!

"వీళ్ళందరి జీవితాలు బాగుచెయ్యాలి ముందు నువ్వు. డబ్బుంటే తల్లిని కూడా కొనుక్కొని వచ్చే రోజుల్లో. అందుకే—నీ కోరిక, నా కోరిక ఒకే దెబ్బతో తీరేలా ఈ పద్ధతి ఎన్నుకున్నాను.

"చూడు—మృత్యుహేల నవలకి పారితోషికం రెండు వేలు. అందులో ఎడిటర్‌కి వేయి కమీషన్ పోయింది. మిగిలింది వేయి. నేనో వేయి కలుపుతున్నాను. ఇదిగో రెండువేలకి చెక్కు....." నా చేతిలో పెట్టాడరుణ్.

రకరకాల ఆలోచనలు నన్ను చుట్టుముట్టాయి. అతి కష్టమ్మీద అదుపులో పెట్టుకున్నాను. తీరగా అరుణ్ని చూశాను.

" 'చెల్లెలికాపురం' సినిమా చూశావా నువ్వు!?"

మందహాసం చేశాడు అరుణ్. "పవన్ అది సినిమా. ఇది జీవితం. అది రచయిత కలం నుండి వెలువడింది. ఇదలా కాదు. మన స్నేహానికి ముడిపడింది. నీ పేరుని

అక్రమంగా వినియోగించుకోవటం లేదు నేను. నీకు పారితోషికం యిచ్చినా ఎడిటర్ కి జీతం వస్తుంది. కమీషన్ ముట్టింది. కేవలం పేరుకోసం దాదాపు నెల జీతాన్ని నీకు ధారపోశాను, అదీ నువ్వు కాదనవనే నమ్మకంతో ...."

మాట్లాడలేకపోయాను. దాదాపు అరగంట ఘర్షణ తర్వాత నా మనసు చల్లబడటం ప్రారంభించింది.

నిజమే! ఆప్యాయతలు కరువై తండ్రీ కొడుకులమధ్య సైతం వ్యాపారతత్వాలు పెరిగిపోతూ కొనసాగుతోన్న ఈ రోజుల్లో ఆ మాత్రం స్వార్థం లేందే ఏ స్నేహితుడు మాత్రం సాయం చేస్తాడు?

చేతిలో చెక్కు ఫ్యాను గాలికి రెప రెప లాడుతోంది.

రెండు వేలు!!

ఎన్ని కథలు వ్రాస్తే వస్తుంది యింత పారితోషికం.

అవును. నాకు డబ్బు కావాలి. నా కుటుంబ సమస్యలు తీరిపోవాలి. అంతవరకూ నా గురించి ఆలోచించే ప్రసక్తే లేదు.

"ఆల్ రైట్ ....ఒక నెలలో నవల పూర్తి చేస్తాను" అన్నాను.

ఆ స్వరంలో అపశృతి నాకు మాత్రమే వినిపించింది.

## 3

చలమయ్య అన్నం కంచం కిటికీలోంచి యివతలికి పెట్టిన చప్పుడు నన్ని లోకంలో పడేసింది.

ఆకలి బాగా అవుతోంది. మౌనంగా అటుకేసి నడి

చాను. కంచం తెచ్చి టేబుల్ పై పెట్టుకున్నాను. ఫ్రిజ్ లోంచి నీళ్ళు తీశాను. బాత్ రూమ్‌లో కాళ్ళూ మొహం కడుక్కొని—అన్నం కలుపుకోసాగాను. ఆలోచనలు— తేనెటీగల్లా ముసురుకుంటూనే వున్నాయి.

మృత్యుకేళి బాగా క్లిక్ అయింది. పాఠకులు బాగా ఆదరించారు. పాఠకుల ఉత్తరాల్లో చాలాభాగం మృత్యుకేళిని గురించే వుండేవి.

అర్జున్ 'తన' తొలి రచనతోనే పెద్ద రచయితల లిస్టులో చేరిపోయాడు.

అతని రచనలు కోసం పత్రికలు ఎగబడసాగాయి. తెలుగు బాల వారపత్రిక్కి సర్కస్ మనుషుల జీవిత కోణాల్ని దర్శింప జేస్తూ 'ఇదో లోకం' పేరుతో సీరియల్ వ్రాశాను. కోవెల మాసపత్రికలో శిల్పుల సాధక బాధకాల్ని విపులీకరిస్తూ వ్రాసిన 'చెక్కని శిల్పాలు' నవల మూడు సంవత్సరాలపాటు పాఠకుల్ని అలరించటమే కాక పత్రిక సర్క్యులేషన్ని కూడ నలభైశాతానికి పెంచింది.

చెక్కని శిల్పాలు నవలకి పారితోషికం రెండువేలు అని చెప్పి తనూ రెండువేలు కలిపి నాలుగు వేలిచ్చాడు అర్జున్ నాకు. అక్కడే నాకు అనుమానం వేసింది.

చెక్కని శిల్పాలు కొత్త సబ్జక్టు. దానికోసం నేను చాల శ్రమించాను. ఎన్నో పుస్తకాలు చదివాను. ఆళ్ళగడ్డ శారదా శిల్పకళామందిర్‌కు వెళ్ళి అక్కడివారిని పరిచయం చేసుకొని నెలరోజుల పాటు అక్కడే వుండి ఎన్నో శాస్త్రీయ పద్ధతుల్ని అవగాహన చేసుకొని నోట్ చేసుకొని అకుంఠిత దీక్షతో రెండు మాసాలు కూర్చొని రాసిన నవల. స్క్రిప్టులోనే నాలుగువంద

పేజీలైంది.

పారితోషికం రెండువేలేనా!?

కాలు కదపకుండా ఫ్యాను క్రింద కుర్చీలో కూచుని ఏ ప్రేమకథని బరికినా రెండు వేలు రాకపోయేవా? ఈ మాత్రం దానికి ఆళ్ళగడ్డ వెళ్ళి అయిదువందలు వదిలించుకొని నెల్నాళ్ళపాటు అక్కడుండి నానా అవస్థలూ పడాలా?

ఇంతకు మించిన దోపిడీ మరేం కావాలి?

సంపాదకుణ్ని కలిసి అడగాలి.

చెప్పులు వేసుకొన్నాను. అంతలో నే నీరసపడిపోయాను.

ఏమని అడగ్గలను? వారి దృష్టిలో నే నెవర్ని?! ఆఫ్టరాల్ ఓ పాఠకుణ్ని, అంతే!

అయినా నా ఆరాటం అణిగిపోలేదు. అర్జున్ ఫ్రెండుగా వెళ్ళి మాటల మధ్య అసలు నిజాన్ని రాబట్టి విస్తుపోయాను.

'చెక్కని శిల్పాలు' నవలకి రచయితగా అర్జున్ పది వేలు అందుకొన్నాడు. తను గొప్ప దాతలా నటిస్తూ ముష్టి నాలుగువేలు నా మొహాన పారేశాడు. ఎంత వంచన!

'ఇదో లోకం' సీరియల్ నవలకి ఎంత లాగాడో?

తెలుగు బాల కార్యాలయానికి పరుగుతీశాను. రచయితగా నా మేధాశక్తి నుపయోగించి అక్కడా కూపీ లాగాను.

పది వేలు!

నాకు అర్జున్ నుండి అందిన పైకం మొత్తం మూడు వేలు!

కడుపులో మసిపోసినట్టయ్యింది. రక్తం వేడెక్కింది. ఆవేశం ఉరకలై ప్రవహించసాగింది. వాడు రాగానే నిలవేశాను.

"నువ్వు నమ్ముతున్నావా?" అన్నాడు.

"నమ్మటం కాదు. ఋజువు చేసుకొని వస్తున్నాను" అన్నాను వివరాలు చెబుతూ.

వాడిలో పెద్ద రియాక్షనేమీ కనబళ్ళేదు నాకు.

"ఏం మాట్లాడవు?" అన్నాను గట్టిగా.

"మాట్లాడేందుకేముంది? పరిశోధించానన్నావుగా" అన్నాడు నిర్లక్ష్యంగా తలెగరేస్తూ.

"అయితే నిజమేనన్న మాట."

"నిజమే!"

"ఎందుకు చేశావీ పని?"

"అవకాశం వచ్చింది గాబట్టి."

"అవకాశం వస్తే ఏదైనా చేస్తావన్న మాట."

"డబ్బెవరికి చేదు బ్రదర్!?"

"నేను మనిషిని కానా? నాక్కూడ డబ్బు చేదు కాదుకదా?! మరి నన్నెందుకు మోసం చేస్తున్నావు?"

అప్పుడు అర్జున్ నవ్వాడు. "పవన్! నిన్నిక్కడికి తీసుకొచ్చిన తొలిరోజుల్ని గుర్తుకు తెచ్చుకో. కథకు యాభై వస్తే చాలు, నవలకు వెయ్యొస్తే చాలు అనే దశలో వున్నావు. ఇప్పుడు నేను ప్రతి నవలకి మూడు వేలకి తక్కువ గాకుండా యిస్తున్నాను. పరోక్షంగా నీ కుటుంబానికి యెన్నో సహాయాలు చేస్తున్నాను. కుంటి చెల్లెలికి తప్ప అందరికీ పెళ్ళిళ్ళు చేయించటంలో ప్రముఖ పాత్ర వహించాను...."

"నో...." గర్జించాను. "ఆ రోజులు నాకు బాగా

గుర్తున్నాయి. అయినా ఆ రోజు నువ్వేమన్నావు? పత్రికా సంపాదకులిచ్చిన పారితోషికానికి వంద శాతం కలిపి యిస్తానన్నావు. చెక్కని శిల్పాలు నవలకి పది వేలు తీసుకొన్నావు. న్యాయంగా ఇరవై వేలు నాకు రావాలి."

వికటంగా నవ్వాడు అర్జున్.

"నేనలా అనుకోలేదు. నీకొక రేటు ఫిక్స్ చేశాను. న్యాయానికి అంతకంటే యెక్కువగానే యిస్తున్నాను. నీ కావలసిన పుస్తకాలన్నీ సప్లయ్ చేస్తున్నాను. సంపాదకుల్ని బతిమాలుతున్నాను...."

"షటప్...." గట్టిగా అన్నాను. "నువ్వు సంపాదకుల్ని బతిమాలే స్టేజీ ఏనాడో దాటిపోయింది. ఒక పత్రికలో ఒక రచన పాపులర్ అయిపోతే ఆ రచయితని ఎవరెస్టు శిఖరంమీద కూర్చోబెట్టే రోజులివి. నువ్వీనాటికీ సంపాదకుల్ని బతిమాలుతున్నావంటే నమ్మటానికి నేను వాజమ్మని కాదు."

"అయితే నిన్ను స్వేచ్ఛగా వుంచటం యికపై ప్రమాదం" అన్నాడు అర్జున్. అంతే. నా తలపై బలమైన దెబ్బ పడింది.

## 4

లేచేటప్పటికి ఈ గదిలో వున్నాను.

అయిదు నిమిషాల పాటు ఏమీ అర్థం కాలేదు. ఆ తర్వాత నెమ్మదిగా అర్థం కాసాగింది. ఒక్క ఉదుటున లేచి కూర్చున్నాను. తలుపువద్దకి పరిగెత్తాను. లాగి చూశాను. రాలేదు.

బాది చూశాను ఎవరూ రాలేదు.

నన్ను ఖైదీని చేశాడని అర్థమైంది. బాధ, కసి,

కోపం, నిస్సహాయత ఒక్కసారిగా ఆవహించాయి. నీరసంగా కుర్చీ దగ్గరకి నడిచి అందులో కూలబడ్డాను.

అప్పుడు చూశాను, టేబుల్ పై టేప్ రికార్డర్.

చటుక్కున ఆన్ చేశాను.

"పవన్! నువ్వు నా స్నేహితుడివే! అయినా నిన్ను బందీని చెయ్యాక తప్పటంలేదు. అందుకు నన్ను క్షమించాలి.

"నిజానికి మనిద్దరిలోనూ స్వార్థం వుంది. అయితే నా స్వార్థం గెలిచే పొజిషన్‌లో వుంది. ఇది గుర్తుంచుకోవటం మంచిది.

"కుటుంబ సమస్యల్తో సతమత మవుతూ నీలోని రచయిత చావబోతున్నందుకు నువ్వు చెరువుగట్టున ఒంటరిగా కూచుని కుమిలిపోతోన్న సమయంలో నేను నిన్ను ఆదుకొన్నాను. నీకు గుర్తుందా? ఈ వూరు రాగానే నిన్ను ఓ ప్రశ్న వేశాను. నువ్వు పేరు కోసం రాస్తావా డబ్బు కోసం రాస్తావా అని. డబ్బు కోసమేనని నువ్వు మనస్ఫూర్తిగా అన్నావు. ఆ తర్వాత నా తంటాలేవో నేను పడ్డాను.

"నీకు అవకాశం యివ్వబడింది. అందుకు ప్రతిఫలంగా నీకు నిస్వార్థంగా డబ్బు ముట్టజెబుతూ వచ్చాను.

"రచయితగా నీ స్థానంలో నేను చెలామణీ అవుతోన్న మాట నిజమే. అందువల్ల నా స్టేటస్ పెరిగింది. రకరకాల వ్యక్తులు పరిచయ మవుతున్నారు. ఎన్నో పత్రికల్లో కొన్ని ఫీచర్లు నిర్వహిస్తున్నాను. ఎన్నో సాహితీ కార్యక్రమాలకి హాజరవుతున్నాను. కొన్ని కార్యక్రమాల్లో పాల్గొంటున్నాను.

"అఫ్‌కోర్స్! ఆ ఫీచర్లకి సంబంధించిన మేటరు,

ప్రశ్నలకు జవాబులు నువ్వే వ్రాస్తున్నావనుకో! కాని అందుకుగురించి నేను పత్రికాఫీసుల చుట్టూ ఎన్నిసార్లు తిరగాలి? రచయితగా, సీరియల్ రచయితగా, ప్రముఖ సీరియల్ రచయితగా ఎంతెంత దూరంలో వున్న స్థలాలకి హాజరవ్వాలి?

"పేరున్న రచయితనని ఎన్నో పేద సంస్థలు వివిధ సందర్భాల్లో విరాళాల కోసం ఎగబడుతున్నాయి. బొచ్చుకుక్క కొన్నందుకు పార్టీ. స్కూటరు రంగు మార్పించుకొన్నందుకు పార్టీ. వేసవికాలం వచ్చేసిందని కూలింగ్ గాగుల్సు కొన్నందుకు పార్టీ! బర్త్ డే జరుపుకున్నందుకు పార్టీ చివరకి కొత్త పెన్ను కొంటే కూడ పార్టీ యివ్వాల్సి వస్తోంది.

"ఈ ఖర్చులన్నీ రచయితగా నాకు ముద్రపడ్డాక ఎదుర్కొంటున్నవే! ఒక గవర్నమెంటు ఉద్యోగిగా యివన్నీ నేను ఎదుర్కొగలనా? నిజంగా నేనే రచయితనై వున్నా రచయితగా నే వార్జిస్తోన్న పైకంలోంచి ఈ ఖర్చులకి వినియోగించి వుండేవాణ్ని — అంతెందుకు? నువ్వే రచయిత వనుకో. నీ పేరుమీదే రచనలన్నీ వస్తున్నాయనుకో. ఈ స్టేటస్ నువ్వు మెయిన్ టెయిన్ చేసుండేవాడివి కావూ!? ఆ స్టేటస్‌కి తగ్గట్టుగా ఖర్చుపెట్టి వుండేవాడివి కాదూ!

"తేడా అల్లా ఒక టే! నా స్థానంలో నువ్వు రాస్తున్నావు. నీ స్థానంలో నేను ఖర్చు పెడుతున్నాను.

"నువ్వు సడన్‌గా ఎదురుతిరిగేసరికి నా కాళ్ళూ చేతులూ ఆడలేదు. ప్రస్తుతం 'తెలుగు ప్రభ' వారపత్రికలో 'నిప్పుల మెట్లు' సీరియల్ నడుస్తోంది. ఇంకా ఆరు ఇన్‌స్టాల్‌మెంట్సు యివ్వాలి. నువ్వు మధ్యలో మూండి

చెయ్యి చూపితే నేను ఆత్మహత్య చేసుకోవాల్సి వస్తుంది. అందుకే ఈ చర్య తప్పలేదు.

"ఈ గదిలో నిన్ను స్పృహలేని స్థితిలో పడకేయించినందుకు నన్ను మన్నించు. ఇకేవీ మనసులో పెట్టుకోకు. నిప్పుల మెట్లు నడల త్వరగా పూర్తిచెయ్యి. ఆ తర్వాత మనిద్దరం కలిసి ఒక ఒప్పందానికొద్దాం. నీకే మాత్రం అసౌకర్యం కలిగినా ఎడమవైపు బటన్ నొక్కు... ఇది జైలు అని నువ్వు భావిస్తే మాత్రం క్షంతవ్యుణ్ని..."

క్లిక్కుమంది టేప్ రికార్డరు.

## 5

టేపులోని అర్జున్ మాటలు నాకు తృప్తి కలిగించలేదు.

జనసమ్మర్దం అధికంగా వున్న రైలుపెట్టెలో మొదట నిలబడటానికి సందు దొరికితే చాలనిపిస్తుంది. నలుగురు ప్యాసింజర్లు దిగిపోతే కూచోడానికి స్థలం వుంటే ఎంత బావుణ్ను అనుకుంటాం. మరి నలుగురు దిగిపోతే ప్రక్కనున్న వాడితో "కాస్త తప్పుకోవయ్యా! నడుం నొప్పెడుతోంది. కాసేపడుకుంటాను" అంటాం.

ఇది మానవ సహజం.

నేను రచయితని కావచ్చు. అయినా నేను మనిషినే. నాకూ ఆశలున్నాయి, కోరికలున్నాయి. సమస్యలున్నప్పుడు నాకు డబ్బు తప్ప మరేమీ కన్పించలేదు. ఒక్కొక్క సమస్యా తీరేకొద్దీ మానవసహజమైన కోర్కె జనించటంలో వింతేమీ లేదు.

అయినా ఆ నాటి నా మాటలు నాకు యిప్పటికీ బాగా గుర్తున్నాయి! నువ్వు పేరు కోసం రాస్తావా డబ్బు కోసం రాస్తావా అని అడిగినప్పుడు 'ప్రస్తుతం

డబ్బు కోసమే' అన్నాను, ప్రస్తుతం అన్న పదంలో ఎంతో అర్థం దాగుంది. అది అర్థం చేసుకోలేకపోవడం అర్జున్ అవివేకాన్ని చాటుతోంది.

నాకు అర్జున్ సాయం చేసుండొచ్చు. అయితే యిందులో అతని స్వార్థం తొంభై శాతం వుంది. అదృశ్య శక్తిగా వ్యవహరిస్తూ అతనికి నేనెంతో కీర్తి తెచ్చి పెట్టాను. దాని కతడు జీవితాంతం కృతజ్ఞుడై వుండాలి.

నే నిప్పటికి మొత్తం పదమూడు నవలలు రాశాను. పేరు రావటానికి ఒక్కటి చాలు. ఆ తర్వాత ఎడిటర్లు చెప్పి రాయించుకొన్నారు. కోమల మాసపత్రిక పదివే లిచ్చింది. మొదటి మూడింటినీ అలా పక్కకి పెట్టినా సగటున నవలకి పదివేలు వేసుకొన్నా పదిటికీ ఒక లక్ష!....

అందులో పాతిక వేలు నాకు యిచ్చినా మరో అయిదువేల వరకూ నా చెల్లెళ్ళ పెళ్ళి సంబంధాల కొరకు ఖర్చు పెట్టినా యింకా డెభ్భై వేల మాటేమిటి? ఒప్పందం ప్రకారం తను మరో డెబ్భై వేలు కలిపి యివ్వాలి. అలా అవసరం లేకున్నా కనీసం వున్న విషయాలు దాచకుండా చెప్పి చెరిసగం తీసుకొందాం అని చెప్పివున్నా నాకింత బాధ కలిగుండక పోయేది.

విషయం దాచి మోసం చేస్తూ ముష్టి మూడు నాలుగు వేలు మొహాన పారెయ్యటం మిత్రద్రోహం కాదూ!

ఆఖరుకి—ఆఖరుకి నన్ను బందీని చేస్తాడా? నిప్పుల మెట్లు సీరియల్ మధ్యలో నే ఆపేసి ఉడాయిస్తానని భయం కాబోలు!

సరే! నిప్పుల మెట్లు సీరియల్ పూర్తయ్యాక సెటిల్

వెంటే కొస్తానన్నాడు కదా! 'చివరి అవకాశం ఇద్దాం, మానవత్వం వున్న మనిషిగా!' అనుకొని మనసుని శాంతి పరచుకొని రచన చెయ్యటాని కుపక్రమించాను.

అదే నేను చేసిన పొరపాటు!

# 6

అడుగుల చప్పుడు ఆలోచనలకి అంతరాయం కల్గించింది. అప్రయత్నంగా చెంప తడుముకున్నాడు. వాడు ఇందాక కొట్టిన చెంపదెబ్బ తాలూకు అనుభూతి ఆ ప్రాంతాన్నింకా వదిలిపోలేదు.

వాడే! సందేహం లేదు!

"మనసు మార్చుకున్నావా?" బొంగురు గొంతుతో అడిగాడు అర్జున్.

అశోకవనంలో సీతాదేవిని పూర్వం రావణాసురుడు ఇలాగే అడిగాట్ట. వాణ్ణి సూటిగా చూట్టానికసహ్యం వేసి సీతాదేవి చేతిలో వున్న గడ్డిపోచని చూస్తూ సమాధానం చెప్పిందట. దానర్థం నాకు రాముడి అండ వుంది, ఆయన ముందు నువ్వు గడ్డిపరకతో సమానంరా వెధవా, పిచ్చిగా వాగకు, గడ్డిపోచలాగే చీలిపోతావు అని.

అలానే నేనుకూడ యిందాక నేను తిని చెయ్యి కడిగేసిన ఎంగిలి కంచంవేపు చూస్తూ చెప్పాను, నువ్వు 'ఎంగిలి వెధవ్వి' అనే అర్థం స్ఫురించేలా.

"లేదు. మార్చుకోవాల్సిన అవసరంలేదు. మార్చుకోలేదు, మార్చుకోను."

"అనవసరంగా నష్టపోతావు సుమా!" హెచ్చరిస్తున్నట్టుగా అన్నాడు వాడు.

"ఇప్పుడు నష్టపోయిందానికన్నానా!? అర్జున్! నిప్పుల మెట్లు నవల పూర్తయ్యాక ఒక ఒప్పందానికొద్దా

మన్నావ్. మనసూ మస్తిష్కం అవమానంతో క్లేశంతో దహించుకుపోతున్నా, లేని ఓపికని, కాని ఏకాగ్రతని అరువు తెచ్చుకొని పూర్తిచేశాను. నెలన్నర కావస్తోంది. ఇంతవరకూ ...."

"ఆఫర్ యివ్వలేదనడం అన్యాయం, నేను 'ఊఁ' అంటే చాలు. తెలుగుప్రియ వారపత్రిక సీరియల్ వేస్తామంటున్నారు. వాళ్ళదే బాలప్రియ పిల్లల పత్రిక వుందిగా. పిల్లల సీరియల్ కూడ కావాలట. నువ్వు 'ఊఁ' అనందే నేనెలా అనగలను?"

"తప్పకుండా రాస్తాను. కాని నన్ను బంధవిముక్తి చెయ్యాలి. రచయితగా ఇక మీదట నా పేరు వెయ్యాలి. కావలిస్తే పారితోషికంలో సగం నువ్వు తీసుకో!"

"ఇది మన ఒప్పందంలో నువ్వు తొలిరోజుల్లోనే కుదుర్చుకోవాల్సిన మాటలు. అదేం వీల్లేదు. అంతా ఇప్పట్లా జరగాల్సిందే! కాకపోతే నవలకు ఐదువేలు చొప్పున యిస్తాను...."

"నువ్వు మిగిలింది కొట్టేస్తావ్."

"అదంతా నీకనవసరం."

"నేను వ్రాయను."

"ఈ మాట అంటేనే నీ దవడ పేలిపోయింది. మళ్ళీ అదే మాట వల్లిస్తున్నావు."

"వల్లించడం కోసమే వల్లెవేశాను. ముల్లెలా భద్రపరచాను. నువ్వు ముల్లుతో గుచ్చినా మాట మార్చను."

"అయితే కథే మారిపోతుంది. నేను మార్చాల్సివస్తుంది. ఇంతకాలం ఒకరకమైన సుందరమైన సుందర జీవితానికి అలవాటు పడిపోయాను. నీలో మార్పువల్ల నా జీవితానికి ఫుల్ స్టాప్ పడుతుంది, అది నేను సహిం

చను. నాకీ జీవితమే కావాలి.

"సాహితీ వినీలాకాశంలో ఎవర్ గ్రీన్ హీరోగా ఇలాగే వుండాలి. అందుకే మన ఒప్పందంలో మార్పేమీ తేబోవడంలేదు. యిప్పట్లాగే నాకు అదృశ్యశక్తిగా వుంటూ నువ్వు రచనలు చేస్తావు. నేను సమాజంలో రచయితగా యిలాగే వెలిగిపోతుంటాను. హాహాహా !!"

యిదొక పిచ్చి! యిదొక ఉన్మాదం!! ఇదొక మూర్ఖత్వం!!! ఇదొక జబ్బు! ఈ పిచ్చితో వెర్రివాడయ్యాడు అర్జున్. ఈ ఉన్మాదంతో మూర్ఖుడయ్యాడు అర్జున్.

రోగికి పథ్యం రుచించదు!

ఇలాంటి మార్పు మనిషికి శ్రేయస్కరం కాదు. ఇందులో నాకూ భాగముంది. ఇదిలాగే కొనసాగిస్తే యెంతో ప్రమాదం.

అయితే ఎలా అరికట్టాలో తెలీలేదు.

ఒకటే మార్గం!

నేనికపై నీ పేరుతో రాయనని ఖచ్చితంగా చెప్పడమే!

అలా చెబితే నాకేమైనా ముప్పొస్తుందా? చంపేస్తాడా? చిత్రహింసలు పెడతాడా?

నేను సహజంగా పిరికివాణ్ని. ఎదటి మనసు నొప్పించటం చేతగానివాణ్ని. అందుకే తరచూ బాధల్ని కౌగలించుకుంటూంటాను. లేకపోతే మరేమిటి? నిప్పుల మెట్లు నడక సగంలో వున్నప్పుడే ఇక రాయనని భీష్మించుక్కూర్చున్నట్లయితే టక్కున దారికొచ్చేవాడు.

వాడు నాకు యింత ద్రోహం చేసినా యింకా నేను మానవత్వాన్నే ప్రదర్శించాను. నిప్పుల మెట్లు పూర్తిచేసి

అప్పగించాను. ఇప్పుడు పెండింగేమీ లేదు. తెలుగుప్రియ, బాలప్రియ పత్రికలకి ఆర్టికల్స్ కావాలి. వాటికి ఐదు వేలు చొప్పున అంటున్నాడు.

"....సారీ అర్జున్! నావల్ల కాదు" అన్నాడు సీరంగా.

"ఓ—ఎందుకిలా మారిపోయావు?" పిచ్చిగా తల కొట్టుకున్నాడు అర్జున్.

"నేను మారలేదు. నీ స్వార్థం నన్ను మార్చింది. నీకు బందీగా వుంటూ నువ్వాడించినట్లల్లా ఆడటానికి నేనేం కీలుబొమ్మని కాను."

"ఆల్ రైట్! ఎంత కావాలి?"

"స్వేచ్ఛ కావాలి నాకు."

"అది మాత్రం జరగని పని."

"అయితే రచయితగా నీకు తెరపడబోతోంది."

అప్పుడు చూశాను అర్జున్‌లో ఉగ్రనరసింహాన్ని. అప్పుడు చూశాను అర్జున్‌లో వీరావేశాన్ని.

"నువ్వు ఎన్ని చిందులువేసినా లాభంలేదు. నన్ను చంపేసినా నష్టంలేదు. ఇక నీ ఆటలు సాగనివ్వను. మిత్రుడనికూడ చూడకుండా నన్ను బంధించడానికి సైతం వెనుదియ్యని కిరాతుడివి నువ్వు. ఇక నువ్వు మామూలు జీవితం గడపక తప్పదు మిష్టర్ అర్జున్!" గంభీరంగా అన్నాను.

బదులుగా చప్పట్లు కొట్టాడు అర్జున్. నల్లగా వున్న చలమయ్య పెద్ద పెద్ద అంగలువేస్తూ వచ్చాడు.

ఉలిక్కిపడ్డాను. చలమయ్యను చూసికాదు. చలమయ్య చేతుల్లో గిలగిలా తన్నుకుంటోన్న రత్నని చూసి. రత్న యిప్పటివరకూ పెళ్ళికాకుండా వున్న నా

కంటి చెల్లెలు! మూతికి టేప్ అతికించబడివుంది.

"రత్నా!" ఆర్తిగా అర్చాను.

విలాసంగా నవ్వాడర్జున్.

"నిన్ను చంపేస్తే నీకుండకపోవచ్చు నష్టం. నాకుంది. నీ ప్రాణం నా ప్రాణంకన్నా అమూల్యమైంది. నీ ప్రాణం తియ్యకుండానే తియ్యడానికి నీ ప్రాణంలో ప్రాణమైన నీ చెల్లెల్ని స్వాధీనం చేసుకున్నాను. ఇప్పుడు చెప్పు. ఈ పిల్ల నీ అరో ప్రాణం! చెప్పినమాట బుద్ధిగా విని కాగితం కలం తీసుకుంటావా లేక...."

నా బుర్ర పనిచెయ్యడం మానేసింది. ఎంతకు తెగించాడు వీడు!? ఆఖరికి నా బలహీనతపైన దెబ్బతియ్యాలని చూస్తున్నాడు.

మళ్ళీ అందుకున్నాడు అర్జున్.

"ఎలాగూ నీ దృష్టిలో కిరాతున్నయ్యాన్నేను. ఆ పేరుని సార్థకం చేసుకుంటాను. త్వరగా తేల్చి చెప్పు."

"ఏం చెయ్యబోతున్నావు దాన్ని!?" వెర్రివాడిలా ప్రశ్నించాను.

"పేరు లేకున్నా మహోన్నతమైన రచయితవు నువ్వు. ఆమాత్రం గ్రహించలేవూ!? కథావస్తువు దొరికితే కలంతో ఆడుకుంటారు రచయితలు. ఆడది దొరికితే కామంతో ఆడుకుంటారు కిరాతులు."

"స్టాపిట్!" గట్టిగా అర్చాను. "ఇడియట్! మొదటి నుండీ నా చెల్లెళ్ళని చెల్లీ చెల్లీ అని పిలుస్తూ ఇప్పుడింత నీచానికి పాల్పడతావా!?"

"అవకాశవాదులకి నైచ్యమే ఆయుధం బ్రదర్! అది లేకుంటే మాకు మనుగడే లేదు. ఇప్పుడు నువ్వు రచన చెయ్యడాని కొప్పుకున్నావనుకో! రత్న నాకు తల్లి

అవుతుంది."

తల పట్టుకుని కుర్చీలో కూలబడిపోయాను బావురుమని ఏడుస్తూ.

## 7

మనసంతా శూన్యంగా వుంది. మస్తిష్కమంతా శూన్యంగా వుంది.

కాళ్ళు లేని రక్తకన్నీటితో ఏడుస్తూ బేలగా చూస్తూ ఆ శూన్యంనిండా నిండిపోతోంది.

ఎలా వస్తాయి వూహాలు?

ఎలా సాగుతాయి అక్షరాలు??

భగవాన్! నాకు తగిన గుణపాఠమే నేర్పావు. పవిత్రమైన, అమూల్యమైన సారస్వతాన్ని ఈ దుర్మార్గుడికి తాకట్టు పెట్టినందుకు నాకు తగిన శాస్తి జరిగింది.

నా కోరలు పీకేశాడర్జున్.

ఇప్పుడు నేను కలం పట్టక తప్పదు.

అర్జున్ కి బానిసగా బతక్క తప్పదు.

ఖైదీగా నాకు మనుగడ తప్పదు.

ఎదిరించడానికి మార్గం లేదు.

తప్పించుకోవడాని కవకాశం లేదు.

ఈ రెంటిలో ఏది జరిగినా నా చెల్లెలి బతుకు నాశనం కాక తప్పదు.

కర్తవ్యమూఢుణ్ణైపోయాను.

"ఎంతవరకొచ్చింది నీ కలం?" గంభీరంగా వినిపించింది.

ఆత్రంగా వెనుదిరిగి చూశాను.

ఎవ్వరూ కనిపించలేదు. బహుశా ఎక్కడో స్పీకర్ అమర్చబడి వుండాలి.

"చెల్లెలి బ్రతుకు నాశనం కాబోతోందని ప్రత్యక్షంగా తెల్సినా నిమ్మకు నీరెత్తినట్టు కూర్చున్నవాణ్ణి నిన్నే చూస్తున్నాను. ఇప్పుడు కిరాతుడివి నువ్వు. పోనీ నీ ముద్దుల చెల్లెలి కంఠస్వరమైనా విను. కాస్తయినా కనికరం కలుగుతుందేమో!"

మరుక్షణం రత్న ఏడుపు గొంతు విన్పించింది.

"అన్నయ్యా! నేనేమైనా ఫర్వాలేదు. నువ్వుమాత్రం వీడికి లొంగకు...."

ఫట్ మన్న శబ్దం విన్పించింది.

"రాయమని చెప్పవే అంటే రాయొద్దని చెబుతావా!" అన్న అర్జున్ గొంతు పులిలా గాండ్రించింది.

ఏడుపు! మూలుగు!! నిశ్శబ్దం!!!

దిగ్గున లేచాను కుర్చీలోంచి. పిచ్చిగా గదంతా పరిగెత్తాను. "అర్జున్! ప్లీజ్, దాన్నేమీ చెయ్యొద్దు. రాస్తున్నాను. ఇదుగో— మొదలు పెడుతున్నాను. 'మంచు పూలు' అనే పేరుతో వ్రాయబోతున్నాను. తెలుగు ప్రియకు టైటిల్ పంపేసెయ్."

నాలోంచి ఏడుపు తన్నుకొస్తోంది. ఎంత ఆపుకుందామనుకున్నా సాధ్యం కావటంలేదు. బిగ్గరగా ఏడ్చేశాను.

"దట్స్ గుడ్. బట్ డిసీజ్ బాడ్. ఏడుపు ఆడదాని లక్షణం. మగాడెప్పుడూ ఆడది కాకూడదు. మొదటి ఇన్ స్టాల్ మెంట్ పూర్తయ్యాక రత్న నిక్షేపంలా మీ యిల్లు చేరుతుంది. అంతవరకూ సకలమర్యాదలతో నాకతిధిగా వుంటుంది."

"వద్దు. దాన్ని పంపెయ్. మా అమ్మ దిగులు పడుతూంటుంది. అది అసలే అభాగ్యురాలు. దాన్ని చూడందే అమ్మ వుండలేదు. ప్లీజ్—రత్నని పంపెయ్."

"ఆల్ రైట్. ఇప్పుడే పంపేస్తున్నాను. మరి మాట నిలబెట్టుకుంటావ్ కదూ!"

"ఈ రోజే—యిప్పుడే మొదలు పెడతాను. కైదికై-నాక్కొంచెం విస్కీ కావాలి."

"గంటలో తెప్పిస్తాను. అవసరమనుకుంటే దాంతో స్నానం చెయ్యి" అన్నాడు అర్జున్ ముగింపుగా.

జిడ్డోడుతోన్న మొహాన్ని చల్లని నీటితో కడుక్కున్నాను. కుర్చీలో కూచున్నాను. మొహానికి పట్టిన జిడ్డునైతే కడుక్కోగలిగాను గాని మనసుకి పట్టిన జిడ్డునెలా కడుక్కోవటం?

మనసుని ప్రశాంతత కౌగలించుకోందే రచనెలా సాగుతుంది?

అందుకే విస్కీ!

అందుకే మైకం!!

ఈ ఆవేదనని బలవంతంగా హత్య చెయ్యాలి నేను. అందుకు తగిన ఆయుధం మద్యం మాత్రమే!!

ఇతివృత్తం ఆలోచించడానికి పూనుకున్నాను.

మనసు మాట వింటేనా!?

ఆలోచనలు సాగుతూనే వున్నాయి.

మధ్యలో తెగిపోతూనే వున్నాయి.

కొత్తవి పుట్టుకొస్తూనే వున్నాయి.

అర్థాంతరంగా ఆగిపోతూనే వున్నాయి.

'టక్'మన్న శబ్దం విని అప్రయత్నంగా తలెత్తాను.

చలమయ్య విస్కీ సీసా టీపాయ్‌పై పెట్టి వెనుదిరిగి వెడుతున్నాడు.

మెరుపులాంటి ఆలోచన వచ్చింది. ఆలస్యం చెయ్య

లేదు నేను. టేబుల్ మీదున్న పేపర్ వెయిట్ తీసుకున్నాను. గురిచూసి తలకేసి విసిరాను. నా గురి తప్పు లేదు. చిన్న మూలుగు మాత్రం వెలువడింది చలమయ్య పెదవులనుండి. తల పట్టుకొని మొదలు నరికిన వృక్షంలా కూలిపోయాడు.

చచ్చాడో బ్రతికాడో ఆలోచించే వ్యవధిలేదు నాకు. లేడిలా చెంగున దూకి పరిగెత్తాను. గది దాటాను. ఎన్ని రోజులున్నానో, ఎన్ని వారాలున్నానో ఈ గదినే ప్రపంచంగా చేసుకుని.

ఈరోజు విముక్తి లభించబోతోందా నాకు!?

అంత అదృష్టం ఇంత త్వరగా రాబోతోందా నాకు? రోజూ కిటికీలోంచి అన్నం అందించే చలమయ్య ఇవాళ మెయిన్ డోర్ తెర్చుకొని వచ్చాడు. ఇదేనా నా అదృష్టం?

అవును. రత్నని చూడగానే నేను తెంబేలు పడి పోయాను. రచన చేస్తానని వాగ్దానం చేశాను. మంచు పూలు టైటిల్ కూడ యిచ్చాను. మన చేతిలోంచి వీడెక్కడికి పోతాళ్ళే అన్న ధీమాతో చలమయ్యని రాచమార్గంగుండా పంపించాడా అర్జున్!

అంతే అయ్యుంటుంది.

రత్న ఏమైంది? వదిలి పెట్టాడా? మొదటి ఇన్‌స్టాల్ మెంటు ఇవ్వంది వదిలి పెట్టనన్నాడే! దాని పరిస్థితి ఎలా వుందో! ఎన్ని బాధలు పెడుతున్నాడో ఏమిటో! వదుల్తానని చెప్పాడు మళ్ళీ. వదిలి వుంటాడా?

మంచుపూలు తొలి విడత యిచ్చినా దాన్ని సురక్షితంగా గమ్యం చేరుస్తాడనే గ్యారంటీ ఎక్కడుంది? తర్వాతి ఇన్‌స్టాల్ మెంట్సు యిస్తానో యివ్వనో అని

అట్టే పెట్టుకోవచ్చుగా! అదసలే కాళ్ళులేని పిల్ల. ఎన్ని బాధలు పెడుతున్నాడో ఏమో!

పాపం అమ్మ! నేను ఉత్తరాలు రాయకపోతేనే బెంబేలుపడే అమ్మ! రత్న కన్పించకపోయేసరికి యెంత కంగారు పడుతోందో ఏమో! ఆమె పరిస్థితి ఎలావుందో!

బందీగా వున్న ఈ పీరియడ్‌లో ఒక్క ఉత్తరం రాసే అవకాశంకూడా యివ్వలేదు వాడు! కోడ్‌లాంటి దుపయోగించి నా ఉనికిని బైటి ప్రపంచానికి తెలీజేస్తా నన్న భయం!

ఇన్నాళ్ళకి ప్రతిఘటించే అవకాశం వచ్చింది. ఈ ప్రతిఘటనకి పర్యవసానం?

నా మనసు క్రమంగా పాషాణమైపోయింది.

ఆ గదిలోంచి మరో గదిలోకి అడుగు పెట్టాను.

మసక చీకటి రాజ్యమేలుతోంది.

నిశ్శబ్దం తాండవం చేస్తోంది.

ఏదో వాసన లీలగా ముక్కుపుటాల్ని సోకుతోంది. ఏమిటది?

ఇంక్!

అవును—ప్రింటింగ్ ఇంకు!!!

ప్రింటింగ్ ఇంకూ న్యూస్‌ప్రింటూ కలగాపులంగా వెలువరిస్తోన్న వాసన!!

మై గాడ్! వీడు పబ్లిషింగ్ హౌస్ కూడా నడుపుతున్నాడా! ఇంతవరకూ నాకా ఆలోచనే రాలేదు.

ఓ నవల ఓ పత్రికలో సీరియల్‌గా రాగానే పబ్లిషర్లు దానికోసం ఎగబడతారు. పుస్తక రూపంలో రచన వెలువడటమే ఆలస్యం. హాట్ కేకుల్లా అమ్ముడుపోతాయవి!

రాస్కెల్ సొంత పబ్లిషింగ్ హౌస్ పెట్టిన విషయం నాతో మాట మాత్రమైనా చెప్పలేదు. ఎంత ఆదాయం!?

మొత్తంమీద నేను నిలువుదోపిడీ చెయ్యబడ్డాను.

గబగబా మరో గదిలోకి మారాను. మెట్లు కన బడ్డాయి. ఎక్కి పైభాగం చేరుకున్నాను.

పరిసరాలు చూశాక నోట మాట రాలేదు నాకు....

# 8

మై గాడ్!

ఇది 'తెలుగు సీమ' వార పత్రిక ఆఫీసు!!

కంపోజింగ్ సెక్షన్ యిది!!!

అంటే—అంటే—నేనిన్నాళ్ళూ తెలుగుసీమ వార పత్రిక అండర్ గ్రౌండ్‌లో బంధింపబడ్డాను. అర్జున్ యింట్లో కాదు!!

తెలుగుసీమ ఎడిటర్‌కీ అర్జున్‌కీ బాటిల్ ఫ్రెండ్‌షిప్ ఉంది. ఆ స్నేహంతో వాళ్ళిద్దరూ చేతులు కలిపి నన్ను చదరంగంలో పావుని చేసి ఆడించారు. ఆడిస్తున్నారు.

ఎంత మోసం! ఎంత వంచన!! ఎన్ని అబద్ధాలు?!

అప్రయత్నంగా జేబు తడిమాను. కేసెట్ తగిలింది. ఇది నా వెంట వుండాలి. నాతో కాకే తెలుగు మోహం చూడాలి. ఇందులో వాడు నన్ను పేరుతో పిలుస్తూ మాట్లాడాడు వాడి కంఠస్వరంకూడ ఒరిజినల్‌గా వుంది.

ఇదొక్కటే వాణ్ని పట్టించడానికి తగిన ఆధారం.

చుట్టూ కలయజూశాను.

ఇప్పుడు ఆఫ్‌సెట్ ప్రింటింగ్, ఫోటో టైప్ సెటింగ్ వగైరా ఆధునిక యంత్రసామగ్రి వచ్చింది. అందుకే పాతకాలం ప్రింటింగ్ మెషన్‌లు ఓ మూల బూజుపట్టి వున్నాయి.

రకరకాల కేస్‌లు! వాటిలో రకరకాల క్రైమ్‌లు!!

అర్జున్ వెంట ఈ వూరొచ్చిన తొలిరోజుల్లో ఓసారి ఈ ఆఫీసుకొచ్చాను. అప్పుడు అంతా చూపించారు, ఎడిటర్ గది, ప్రాసెసింగ్ సెక్షను, ఆర్టిస్టుల రూము, ప్రూఫ్ కరెక్షన్సు జరిగే విభాగం, అసోసియేట్ ఎడిటరు సీటు, అసిస్టెంట్సు, సబ్ ఎడిటర్లు కూర్చునే రూమ్సు— అబ్బో ఎన్ని గదులు? ఎంత ఎస్టాబ్లిష్‌మెంటు?

రెండు ట్యూబ్ లైట్లు మాత్రం వెలుగుతున్నాయి. కుడివైపు ద్వారంలోంచి వెడితే ఆఫ్‌సెట్ ప్రింటింగ్ వున్న విశాలమైన హాలు వస్తుంది. అక్కణ్నుండి మిగత గదులకి వెళ్ళే మార్గం నాకంతగా గుర్తులేదు.

అయినా తప్పదు. చీకట్లో బాణంలా దూసుకుపోవాల్సిందే! ఎవరయినా ఎదురుకావటం కాకపోవటం, పట్టుబడటం, పడకపోవటం అనేది నా అదృష్టంపై ఆధారపడి వుంది.

నాకు కాపలాగా చలమయ్య ఒక్కడే నియమించబడినట్టుంది. వాడింకవరకూ రాలేదు కాబట్టి పేపర్ వెయిట్ తన గట్టిదనాన్ని బాగా నిరూపించుకొని తన విధ్యుక్త ధర్మాన్ని సక్రమంగా నిర్వర్తించిందన్న మాట.

చక చక అడుగులు వేశాను.

పొడుగాటి నడవా వచ్చింది. కుడివైపూ యెడమవైపూ గదులున్నాయి. సబ్ ఎడిటర్లూ ఆర్టిస్టులవీ సంబంధించినవి.

చప్పుడు చెయ్యకుండా పరిగెత్తబోతూ ఓ గదిలో ట్యూబ్‌లైటు వెలుగుతూండటంతో ఆగిపోయాను.

నన్నే పత్రికాఫీసులో బంధించాడూ అంటే రత్నని

తన యింట్లో బంధించేంతటి వెర్రివాడు కాడు అర్జున్. అది కూడా యిక్కడే యెక్కడో వుంటుంది. ఇక్కడ లేదుకదా!

తలుపులు నాకంటే ఎత్తులో వున్నాయి. వెంటిలేటర్ లోంచి లోపలి దృశ్యాన్ని చూడవచ్చు. కాని ఎక్కడానికి స్టూల్ లాంటి సాధనం లేదు. గోడలు నున్నగా వున్నాయి.

నెమ్మదిగా అటూ యిటూ చూశాను. పెద వ్విరిచాను.

ఈలోగా మాటలు వినిపించాయి, లోపల్నుండి. తలుపులకి చెవి ఆనించాను.

“రాస్తూంటాడంటావా?” ఎడిటర్ ప్రశ్న.

“రాయక ఛస్తాడా?! చావాలనుకొన్నా చావనిస్తామా? అక్కడికీ యెంత బెట్టు చేశాడనుకొన్నావ్? నువ్వు చెప్పిన అయిడియా అమోఘంగా పని చేసింది” ముద్ద ముద్దగా అర్జున్ కంఠస్వరం.

ఇద్దరూ కల్సి తాగుతున్నారన్న మాట.

మళ్ళీ ఎడిటర్ కంఠం పలికింది.

“ప్రతి వస్తువుకీ గరిమనాభి వున్నట్టే ప్రతి మనిషికీ బలహీనత వుంటుంది. దాన్ని చూసి దెబ్బకొట్టామంటే దక్కన పడిపోవాల్సిందే! పవన్ చెల్లెళ్ళ పెళ్ళిళ్ళయిపోయాయి. మిగిలింది ముసలి తల్లీ కుంటి చెల్లెలూను. తల్లి మేలా చెల్లాయి మేలా అని బాగా ఆలోచించాను. తల్లయితే చంపుతామని మాత్రమే బెదిరించగలం. అదే చెల్లెలి తేనా! మానభంగం చేస్తామని కూడ బెదిరించడాని కాస్కారం వుంటుంది....”

“అందుకేగా పార్టీ ఇస్తున్నాను!?”

"పార్టీ ఒక్కటే చాలా?"

"మైకం రానివ్వు భాయ్! మంచు పూలు టైటిల్ యిచ్చాడుగా గురుడు! ఇరవై వేలు ప్రామిస్ చేశాడు తెలుగుప్రియ ఎడిటరు. నీకు పదివేలిస్తాను."

"థాంక్యూ! మరి పవన్ కో!?"

"నీకు పదివేలూ వాడికి ఐదువేలూ పోతే బోడి ఐదు వేలేనా మిగిలేది!? వాడికీ సారి యివ్వను. అరిస్తే రత్నని కరుస్తానంటాను. ఇంకా అరిస్తే నిజంగానే కరిచేస్తాను."

"నేనిందాకే కరిచేశాను!"

"వాట్!?" అర్జున్ గట్టిగా అరచాడు.

నేను కొయ్యబారిపోయాను. మైగాడ్! నా వూహ కరక్టే అయింది. దాన్ని పంపించలేదు. ఇక్కడే బంధించారు. పైగా.... పైగా ...

"సారీ గురూ!" సంజాయిషీ ధోరణిలో అన్నాడు ఎడిటరు. "దాన్ని నా ప్రైవేట్ గదిలోనే బంధించాం కదా! ఇందాక నువ్వు లేవు. బాటిల్స్ ఓపెన్ చెయ్యడానికి ఓపనర్ కనిపించలేదు. కత్తి కోసమని నా గదిలోకి వెళ్ళాను. దిగాలుగా ఆపిల్ పండు ముక్కలు తింటూ కూచుంది. ఆ భంగిమలో ఆపిల్ కంటే ఆ పిల్లే నాకు బాగా నచ్చింది. చెప్పొద్దూ! అప్పటికే కాస్త మైకంలో వున్నాను. ముందూ వెనకా చూశ్శేదు...."

"ఎంతపని చేశావురా! ఈ విషయం ఆ పవన్ గాడికి తెలిస్తే కొంప మునుగుతుంది. మంచు పూలు రాయడు; మశానం పూలు రాయడు. కొంప ముంచావు కదయ్యా! అసలది బ్రతికుందో చచ్చిందో చూసొస్తానుండు. అసలు దాన్ని పంపించేస్తానని వాడికి మాటిచ్చాను. ఎందుకైనా

మంచిదని వుంచుకున్నాను....”

నా రక్తం కతకత ఉడికిపోతోంది. శరీరం విపరీతంగా కంపిస్తోంది. ఆవేశం బుసలుకొడుతోండగా నా ముక్కుపుటాలు అగురుతున్నాయి.

రారా! బైటికి రా! నా ముష్టిఘాతంతో నీ తలని రెండుగా చీలుస్తాను. నా బలమైన వ్రేళ్ళతో నీ గుండెలు చీల్చి ఆ రక్తంతో నా చెల్లి హృదయాన్ని చల్లారుస్తాను!

పొజిషన్‌లో నిల్చున్నాను, అర్జున్ రాగానే దెబ్బ తియ్యడానికి. అవును! నా చెల్లెల్ని పాడుచేసింది ఆ దుర్మార్గుడైనా అందుకు కారణం వీడే! అర్జున్‌గాడే! వీణ్ని నిలువునా చీరేసినా పాపంలేదు.

అమ్మా రత్నా! నన్ను క్షమించమ్మా! ఏనాడో పరిస్థితులకు లొంగి నేను చేసిన సాహితీ ద్రోహానికి ఫలితంగా నువ్వు శిక్ష అనుభవించావు. నీకు జరిగిన ఈ దారుణ అన్యాయానికి నైతిక బాధ్యత వహిస్తూ ఈ క్షణం నుండి నాలోని రచయితని నిద్రకు—శాశ్వత నిద్రకు గురి చేస్తున్నానమ్మా!

మూగగా రోదించాను.

రాడేం, అర్జున్‌గాడు ఎంతకీ రాడేం!?

ఇప్పుడు నా మనసు ప్రశాంతంగా వుంది. అర్జున్ గాడు సరికదా! సాక్షాత్తు ఇంద్రుడు దిగొచ్చినా నన్నేమీ చెయ్యలేడు. అంతగా అయితే నా ప్రాణం తియ్యగలడు!

ఇదివరకటి టెన్షన్ లేదు.

ఇదివరకటి బాధ లేదు.

ఇదివరకటి ఆలోచనల్లేవు.

రచయితగా నా పేరు రావాలన్న కాంక్ష లేదు.

ఇప్పుడు టెన్షన్ ఒక్కటే!

ఇక్కణ్నుంచి బైటపడి పిల్లిదగ్గిర వెలుగులోకి లాక్కురావాలి.

ఇప్పుడున్న బాధ, ఆలోచన, కాంక్ష అన్నీ కలిపి ఒక్కటే.

నా చెల్లిని రక్షించాలి. ఆమెని అంటిపెట్టుకొని వుండాలి.

అసలు రత్న బతికుంటుందా యింతవరకూ!? తనకి జరిగిన అవమానాన్ని సహించలేక నాకు మొహం చూపించలేక ఆత్మత్యాగం చేసుకొనుండదు గదా!

భగవాన్ అలా జరక్కుండా చూడు!

ఏదెంతకీ రాదేం!

ఎడిటర్ గాడు బలవంతంగా ఆపివుంటాడు.

మళ్ళీ చెవులు రిక్కించాను.

"బాధపడకు బ్రదర్! అయిపోయిందేదో అయిపోయింది. ఇకమీదట అలా ప్రవర్తించను కదా! నన్ను 'క్ష'మించు! ఒకవేళ యిప్పుడు దాన్ని చూడబోయినా మూడ్ మారిపోయే పరిస్థితి ఎదురైతే బావుండదు. ఖరీదైన మూడ్‌లో వున్నాం. ప్లీజ్—టేకిట్ ఈజీ!" ఎడిటర్ బతిమాలుతున్నాడు.

అర్జున్ గొణుగుతున్నాడు ఏదేదో.

హుఁ! టేకిట్ ఈజీ అట! ఎంత సులభంగా అనగలుగుతున్నాడీ మాట!

సరే! అర్జున్ గాడు బైటికి రాడని తేలిపోయింది. నా రత్న—నా చిట్టితల్లి యెలావుందో చూడాలి. బతికుంటే దాన్ని—లేదా దాని శవాన్నైనా సరే—తీసుకుని

యిక్కడినుండి బైటపడాలి. ఆ తర్వాత నేరుగా పోలీస్ స్టేషన్కి దారి తియ్యొచ్చు.

ఎడిటర్ గది నాకు లీలగా గుర్తుంది. ఎందుకంటే మేం ఆనాడు యెక్కువసేపు కూచుని మాట్లాడింది అక్కడేగా!

నేరుగా అక్కడికి దారితీశాను. పదినిమిషాలకి అతడి ప్రైవేట్ గదిని గుర్తించ గలిగాను. గదిలో ట్యూబ్ వెలుగుతోన్న చిహ్నాల్లేవు. నీలంరంగు జీరో లైటు మంథంగా వెలుగుతోంది.

తలుపు తట్టే ముందు చిన్నగా వణికాయి చేతి వ్రేళ్ళు....

ఎలాంటి దృశ్యం ఎదురౌతుందో! ఎలాంటి సన్నివేశం చూడాల్సి వస్తుందో....

చిన్నగా తలుపు తట్టాను. వెన్ను జలదరించింది. ఈ మాత్రం శబ్దానికి యెవరయినా వస్తారేమో! రత్న కోసం ఎవర్నయినా కాపలాగా నియమించారేమో!

ఎవరూ రాలేదు. లోపల్నుండి రెస్పాన్స్ లేదు.

అప్రయత్నంగా తలుపు మెల్లిగా తోశాను. తెరుచుకుంది.

ఆశ్చర్యపోయాను. కాని ఆలోచించాక స్ఫురించింది....

ఎడిటర్ వచ్చి పశువుగా మారి వెళ్ళిపోయాక రత్నకి తలుపు గడియ వేసుకునే శక్తి వుండదు. అసలే వంటి పిల్ల. జరగాల్సిందంతా జరిగిపోయాక తలుపు గడియ వేసుకుంటే నేం? వేసుకోకపోతే నేం?

మెల్లిగా లోపలికి అడుగులు వేశానో లేదో! నీడ లాంటి ఆకారం నా కళ్ళముందు ఒక్క క్షణం పాటు కద

లాడింది. మరుక్షణం నా పొట్టలో పొడుగాటి కత్తి దిగింది!

ప్రేవులు బైటికొచ్చేశాయి. చెంబులోంచి నీళ్ళు క్రింద పోస్తున్నట్టుగా రక్తం నేలని తడుపుతోంది ధారగా కురుస్తూ.

కేక వెయ్యబోయి పళ్ళ బిగువున సహించాను. ఆ ఆకారం కేసి చూశాను.

రత్న! నా చెల్లెలు రత్న!!

ఆమె కళ్ళు నిప్పుల్ని కురిపిస్తున్నాయి. అతి కష్ట మీద టేబుల్ని తలుపువద్దకి జరిపి కత్తి పట్టుకుని దాని దానిమీదకి ఎక్కి కూచుంది.

“అమ్మా.... నేనమ్మా....” అతి కష్టంమ్మీద అనగలిగాను, నేల వాలుతూ.

కెవ్వున కేక వేసింది రత్న. దబ్బుమని నామీద పడిపోయింది.

“అన్నయ్యా! నువ్వా! అయ్యో యెంతపని చేశాను? యిందాకటి రాక్షసుడు మళ్ళీ ఖచ్చితంగా వస్తాడు, వాడో—అర్జున్ గాడో యెవడో ఒకడు ఈ కత్తికి బలి కావాలని యింత సేపూ నా ప్రాణం తీసుకోకుండా ఆగాను. ఆఖరుకి ....నిన్ను ....” ఆ పైన మాట్లాడలేక పోయింది రత్న. నన్ను చుట్టేసుకుని బావురుమంది.

నా కళ్ళు తేలిపోతున్నాయి. వంట్లో రక్తం తరిగి పోతోంది.

“అమ్మా.... కాలం సరైన తీర్పునిచ్చింది. విధి.... సరైన గుణపాఠం నేర్పింది. భగవంతుడు తగిన శాస్తి చేశాడు. నీ పతనానికి పరోక్ష కారణమైన నాకు యిదే సరైన న్యాయం. సరైన న్యాయం జరిగింది. కాముల

కోసం కలాన్ని తాకట్టుపెట్టిన నేను కలాన్ని మూసినా కళ్ళు మూసినా కాలం ఒడిలో పదిలంగా నిలిచిపో గలిగితే నా చరిత్ర చెప్పుకొని అందరూ అస్యహించుకుంటే నే చిరంజీవిని కాగలను. ఆ....అ పని చెయ్యమ్మా! అప్పుడే నా....ఆత్మకు....శాం....తి...."

నా కళ్ళు బరువుగా మూసుకుపోతున్నాయి. తెరవాలని ఎంత ప్రయత్నించినా సాధ్యం కావడంలేదు. చివరిసారిగా రత్నకేసి చూసిన నాకు నా పొట్టలోంచి కత్తి లాగి తన పొట్టలో గుచ్చుకుంటోన్న రత్న అస్పష్టంగా కన్పించింది. కాని....

ఆలస్యమైపోయింది.

—: అ యి పో యిం ది :—